క్లుప్తంగా

డాక్టర్ ఉమాశంకర్‌కు అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణులు, అహల్య ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్‌కు ఐఎస్ఏఆర్ అప్రీయేషన్ అవార్డు లభించింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెట్ రీ ప్రొడక్షన్ కాన్ఫరెన్స్ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగింది. ఈ కాన్ఫరెన్స్‌కు ఇండియాలోని పలువురు ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణులు పాల్గొన్నారు. సంతానం లేని దంపతులకు గత 15 సంవత్సరాలుగా గుంటూరు నగరంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు ఐఎస్ఏఆర్ ప్రెసిడెంట్ డాక్టర్ నందిత పాల్‌సెక్టర్, సెక్రటరీ డాక్టర్ సుజాతా కార్‌లు అవార్డులు అందజేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు గుంటూరుకు చెందిన పలువురు గైనకాలజిస్టులు, గైనకాలజిస్టుల సంఘం నేతలు, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్యులు అభినందనలు తెలిపారు.

అలరించిన సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో శ్రీ శుభాంజలి కళా వేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయకులు పురుషోత్తమ ప్రసాద్, మిరియాల ప్రసాదరావు, దొప్పలపూడి శ్రీనివాసరావు, కృష్ణారావు, అబ్దుల్ ఖాదర్, ఆదాము, బంగారు పాప, చింతా రజని శ్రావ్యంగా పాటలు ఆలపించారు. అనంతరం జరిగిన సభలో మిరాకల్స్ వరల్డ్ రికార్డ్స్ జ్యూరీ సభ్యులుగా ఎన్నికైన తూములూరి రాజేంద్ర ప్రసాద్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యా శాఖ అడిషనల్ సెక్రటరీ రాసంశెట్టి నరసింహారావు, సేవాసదన్ అధ్యక్షులు మిరియాల గోపీకుమార్, ప్రముఖ రంగస్థల నటులు కావూరి సత్యనారాయణ, వెంకాయమ్మ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సిరిగిరి గణేష్, శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సంగీత మహోత్సవాలు ప్రారంభం



పాత గుంటూరు: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ స్వామి కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో త్యాగబ్రహ్మ 177వ ఆరాధన సంగీత మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి నిర్వహణలో రామరాజు ఫౌండేషన్ లక్ష్మీ శ్రీనివాస్ జ్యోతి ప్రకాశనం చేశారు. ఔత్సాహిక కళాకారులు త్యాగరాజ కృతుల్ని గానం చేసి ఆహూతుల్ని అలరించారు. సాయంత్రం సభలో 'త్యాగరాజు విజయం' అనే అంశంపై అతిథులు ప్రసంగించారు. అనంతరం శాస్త్రీయ సంగీత కచేరీలో శ్రీ త్యాగరాజస్వామి కృతుల్ని వీనుల విందుగా గానం చేశారు. కార్యక్రమంలో జి.జానకి, కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, ఉప కార్యదర్శి ఎం. మాధవీకృష్ణ, కోశాధికారి ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు. కళాకారులను, అతిథులను సత్కరించారు.

అక్రమంగా మద్యం కలిగిఉన్న ముగ్గురి అరెస్టు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా మద్యం కలిగి ఉన్న ముగ్గురిని సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరండల్‌పేటలోని సెబ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాలాజీనగర్ జీరో లైనులోని ఓ నివాసంలో నిబంధనలకు మద్యం నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆవుల సుజాత, కఠెవరపు శ్రీను, షేక్ మాలిక్‌బాషాలను అరెస్టు చేసి, 85 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముస్తఫా, సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా



నూరిఫాతిమాను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు, పక్కన ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నియోజకవర్గంలో ప్రజా సమస్యల్ని పరిష్కరించేందుకు అన్నివేళలా కృషి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 3వ డివిజన్, పాత గుంటూరు, మణి హోటల్ సెంటర్, ఆంజనేయస్వామి దేవస్థాన ప్రధాన రహదారి, బాలాజీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం నూరిఫాతిమా ప్రచారం చేశారు. ముందుగా బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ ముందుకు సాగారు. వైఎస్సార్ సీపీకి అండగా నిలబడాలని, రానున్న ఎన్నికల్లో తన కుమార్తె నూరిఫాతిమాను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముస్తఫా కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. శివారు కాలనీల నుంచి మిగతా ప్రాంతాల వరకు అన్ని పనులు పూర్తి చేశామని చెప్పారు. సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రజల్ని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని భుజ స్కంధాలపై పెట్టుకుని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా వారిని ముందుకు తీసుకెళ్లారని వివరించారు. తూర్పు నియోజకవర్గాన్ని గెలిపించి ఆయనకు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, క్లస్టర్, మండల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

కులగణనలో సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

నెహ్రూనగర్: ప్రభుత్వం చేపట్టిన కులగణన నమోదు ప్రక్రియలో ప్రజలు తమ మతం రికార్డు చేసుకునే విషయంలో ఎదురవుతున్న సమస్యకు పరిష్కారం చూపాలని మత సామరస్య రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్షుడు ఈరీ రాజశేఖర్ జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అక్కడక్కడా వలంటీర్లు అవగాహన లోపంతో ప్రజల అభీష్టం మేరకు కాకుండా తమ సొంతంగా ప్రజల వద్ద ఓటీపీ తీసుకుని వారే నమోదు చేస్తున్న విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీకి చెందిన ఏ కులం వారైనా తాము అనుసరిస్తున్న మతాన్ని ఆప్షన్‌గా రికార్డు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ఆ విధంగా కులగణన జరిగే విధంగా చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మేడిద బాబురావు, జి.శామ్యూల్, మాదాసు శామ్యూల్, ఎన్‌జే రాజ్‌కుమార్, పప్పుల అజయ్ జాషువా, సుధీర్, కృపాసాగర్, కోటేశ్వరరావు ఉన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీటీసీ కరీం, డీఎస్పీ బాలసుందరరావు తదితరులు

పట్నంబజారు: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని డీటీసీ షేక్ కరీం, నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం. బాలసుందరరావు సూచించారు. జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా శనివారం పోలీసు పేరేడ్ గ్రౌండ్స్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసిన వారే ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ రహదారి భద్రత నిబంధనలు పాటించటం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చని తలిపారు. కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ ఎన్జీవో రాజకుమారి, ఎంవీఐలు ఎన్. గోపాల్, టి. రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లేశ్వరి, జి. సౌజన్య, ట్రాఫిక్ సీఐలు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆ..నాటి.. ఆ స్నేహ ఆనందగీతం..



సమ్మేళనానికి హాజరైన పూర్వ వైద్య విద్యార్థులు

గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1981 ఎంబీబీఎస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో కలుసుకున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో స్థిరపడిన వైద్యులతోపాటు, విదేశాల్లో ఉంటున్న వారు సైతం సుమారు 42 ఏళ్ల తరువాత వైద్య కళాశాలలో కలుసుకుని నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. గుంటూరు జీజీహెచ్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్‌ను పలువురు వైద్యులు అభినందించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ పాదిల ప్రసాద్ జీజీహెచ్ అభివృద్ధికి గతంలో రూ. 5 కోట్లు ఇచ్చినా, మళ్లీ నేడు రూ. 2 కోట్లు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, కృష్ణా జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, డాక్టర్ మస్తాన్, డాక్టర్ మొహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రైన్డ్ నర్సెస్ రాష్ట్ర సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సుశీల, తదితరులు

గుంటూరు మెడికల్: ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ బ్రాంచి ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ కె.సుశీల చెప్పారు. శనివారం స్థానిక బ్రాడీపేటలో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్ఎస్‌డీసీ సీఈఓ డాక్టర్ వి. వినోద్‌కుమార్, గౌరవ అతిథులుగా డీఎంఈ డాక్టర్ నరసింహం, ఐఆర్‌సీఎఫ్ చైర్మన్ డాక్టర్ చక్రరావు, యూఎస్ఏకు చెందిన డాక్టర్ ప్రభాకర్ శర్మ, నర్సింగ్ డెప్యూటీ డైరెక్టర్ వల్లి, అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ అజినాత్ హాజరవుతున్నట్లు వెల్లడించారు. తమ సంఘ సభ్యులకు దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో సైతం నర్సింగ్ అవకాశాలు.. కెరీర్ అభివృద్ధిపై స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా వివరిస్తున్నామని సుశీల చెప్పారు. నర్సింగ్ విత్ అవుట్ బోర్డర్స్, ఎక్స్‌ప్లోరింగ్ గ్లోబల్ ఆపర్చునిటీస్ అనే నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నగదు చోరీపై కేసు నమోదు

పట్నంబజారు: ప్రయాణికుడి జేబు నుంచి నగదు దోచుకున్న ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గుంటూరుకు చెందిన ఎం.కాళిదాసు శనివారం కొత్తపేటలోని శ్రావణి హాస్పటల్‌కు మందులు తీసుకునేందుకు వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో ఆటో ఎక్కారు. ఆయన పక్కన కూర్చున్న ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా వ్యవహరిస్తుండటంతో ఆటో దిగేశారు. తరువాత జేబు చూసుకోగా రూ. 30వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపేట ఆరో లైను నుంచి ఖాదర్ అనే వ్యక్తి ఇళ్ల నుంచి రేషన్ సేకరించి, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 75 బస్తాల్లో 3,750 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్ : వ్యక్తిపై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేవీపీ కాలనీలో నివాసం ఉండే కార్తిక్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో పాత కక్షల నేపథ్యంలో బత్తుల అశోక్‌కుమార్, అతని అనుచరులు జనవరి 30న రాళ్లు,కర్రలతో దాడిచేశారు. స్థానికులు అడ్డుకున్నారు. గాయపడిన కార్తిక్ చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దాడి చేసిన అశోక్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

దంపతులపై దాడి

ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో దంపతులపై దాడిచేసిన వారిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురంలో నివాసం ఉండే పేరయ్య, శివపార్వతి దంపతులు వెంకటేశ్వర్లుకు గతంలో రూ. 10 లక్షలు అప్పు ఇచ్చారు. దాన్ని చెల్లించలేక తన ఇంటి పై పోర్షన్‌లో అద్దె చెల్లించకుండా ఉండమని పేరయ్య దంపతులకు చెప్పాడు. ఈ మేరకు దంపతులు పోర్షన్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం వెంకటేశ్వర్లు కుమారుడు సతీష్‌కుమార్, మరికొందరు కుటుంబ సభ్యులు పేరయ్య వద్దకు వెళ్లి అద్దె చెల్లించాలని గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో పేరయ్య దంపతులపై దాడి చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10న కనపర్తి ఏసురత్నం సంస్మరణ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నెహ్రూనగర్: దళిత ఉద్యమ నేత కనపర్తి ఏసురత్నం సంస్మరణ సభ ఈ నెల 10న ఏసీ కాలేజీలోని జేడీ శీలం ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్ తెలిపారు. లాడ్జి సెంటర్‌లో శనివారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలియమ్స్ మాట్లాడుతూ దళిత ఉద్యమాలపై జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు కనపర్తి అని కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై పేద ప్రజల సమస్యల పరిష్కారంపై గళంమెత్తారని తెలిపారు. సంస్మరణ సభలో అంబేడ్కర్ జీవిత విశేషాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నిర్వాహణ కమిటీ సభ్యులు సుధాకర్ నరేంద్ర, జ్ఞాన రాజు, యండ్రపాటి అశోక్, కొండపల్లి విల్సన్, రాయపూడి మరియ దాసు పాల్గొన్నారు.

ఏలూరుకు తరలివెళ్లిన విద్యార్థులు



ర్యాలీగా వెళ్తున్న పానుగంటి చైతన్య, విద్యార్థులు

విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి ఆధ్వర్యంలో ర్యాలీ

పట్నంబజారు: విద్యార్థులే నవసమాజ నిర్మాతలు అని మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధిగా నమ్మిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య చెప్పారు. ఏలూరులో శనివారం జరిగిన సిద్ధం కార్యక్రమానికి విద్యార్థులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ విప్లవాత్మకమైన సంస్కరణలతో వేల కోట్ల రూపాయలను విద్యార్థుల కోసం సీఎం జగనన్న ఖర్చు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ఉన్నతికి నిస్వార్థంగా శ్రమిస్తున్న ఆయనకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజినల్ కో–ఆర్డినేటర్ విఠల్, గంటి, రవి, బాజీ, జగదీష్, వలి, బంటి, మహేష్, అజయ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఆవరణలో మౌలిక వసతులకు కృషి

జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి



మరుగు దొడ్లును ప్రారంభిస్తున్న జేసీ రాజకుమారి, పక్కన డీఆర్ శైలజ

గుంటూరు వెస్ట్: కలెక్టరేట్ ఆవరణలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సుమారు రూ.12 లక్షల వ్యయంతో రిజిస్ట్రేషన్ ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు ఆవరణలోని మిగతా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల ఇబ్బందులను గుర్తించి మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. ఇదే ప్రాంగణంలో రూ.30 లక్షల వ్యయంతో ఇన్నర్ రోడ్లు కూడా నిర్మాణం చేపట్టామని చెప్పారు. మన ఆస్తులను మనమే కాపాడుకోవాలనే నినాదంతో వీటిని చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ మాట్లాడుతూ జేసీ రాజకుమారి చొరవతోనే మరుగుదొడ్లను ఆధునిక విధానంలో నిర్మించారని, చాలా మందికి ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. రోడ్డు కూడా పూర్తయితే మరింత సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఎం.వి జయ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రెండంతస్తుల నిర్మాణానికి వినతి



కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న హెల్త్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, పక్కన డాక్టర్ ప్రసాద్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ భవనంలో మరో రెండంతస్తుల భవన నిర్మాణం చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కోరారు. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును సచివాలయంలో జింఖానా ప్రతినిధి, గతంలో డాక్టర్ పాదిల ప్రసాద్ భవన నిర్మాణానికి రూ. 5 కోట్ల విరాళం అందజేసిన డాక్టర్ పాదిల ప్రసాద్‌తోకలిసి వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో భవన నిర్మాణం చేపట్టేందుకు కావాల్సిన జీఓ వచ్చేవిధంగా కృషి చేస్తానని కృష్ణబాబు హామీ ఇచ్చినట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. జీజీహెచ్‌లో సుమారు రూ. 85 కోట్లతో నిర్మాణం జరుగుతున్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణ పనులపై కృష్ణబాబు ఆరా తీశారు. బొంగరాలబీడు సమీపంలో జీజీహెచ్‌కు కేటాయించిన ఆరు ఎకరాల స్థలం కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి కళాశాల నిధులు ఖర్చు పెట్టుకునేందుకు సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు

మేయర్ కావటి



స్థానికులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 18వ డివిజన్ ఆర్.అగ్రహారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం మెయిన్ రోడ్డు నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు నగరపాలక సంస్థ రూ. 85 లక్షల ఎన్‌క్యాప్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైపులైన్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్.అగ్రహారంలో డ్రెయిన్లు శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక ప్రజావసారాల దృష్ట్యా, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు నూతనంగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. నిర్దేశిత గడువులోగా పనులు చేపట్టని పక్షంలో నిధులు వెనక్కు వెళ్లే అవకాశం ఉందని చెప్పారు. రోడ్డు నిర్మాణంలో ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని, వాటిని స్థానికులే స్వచ్ఛందంగా తొలగించుకొని, నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. ఆక్రమణల తొలగింపులో ఎక్కువగా నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, స్థానిక పెద్దలు అశోక్ జైన్, మహావీర్ జైన్, కూనిశెట్టి మదన్, చెక్క వేణు, దర్శి హనుమంతరావు, ఫణీంద్ర, వేలూరి చిట్టిబాబు, వేలూరి రమేష్ బాబు, నూనె కిషోర్, మద్ది రామకృష్ణ,, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు, ఏఈలు, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.